www.prajasakti.com

ప్రజాశక్తి

గురువారం 26 జూన్ 2025

5

తూర్పుగోదావరి

5న జాతీయ మెగా లోక్ అదాలత్

జిల్లా తొమ్మిదవ అదనపు జడ్జి ఎం అనురాధ

ప్రజాశక్తి - కొవ్వూరు

జులై 5న నిర్వహించే జాతీయ మెగా లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా తొమ్మిదో అదనపు జడ్జి ఎం.అనురాధ కోరారు. రాజీ పడదగిన అన్ని రకాల కేసులను లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించుకోవచ్చన్నారు. డబ్బులు, సమయం ఆదా అవుతాయన్నారు. కక్షిదారులు ఇరుపక్షాలు రాజీమార్గం ద్వారా కేసులు పరిష్కరించుకోవడం ద్వారా వీటిపై అప్పీల్‌కు వెళ్లే అవకాశం ఉండదన్నారు. కొవ్వూరు కోర్టు హాల్లో ఈ మెగా లోక్ అదాలత్ ను నిర్వహిస్తామని ఆమె తెలిపారు.

కమ్మేస్తున్న ప్లాస్టిక్ భూతం

- రెండేళ్లయిన అమలు కాని నిషేధం
- తాజాగా ముఖ్యమంత్రి ప్రకటనతో మరోసారి తెరపైకి

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

ప్లాస్టిక్ భూతం నగరాన్ని పట్టి పీడిస్తోంది. ఎక్కడ చూసినా ప్లాస్టిక్ వ్యర్థాలు కనిపిస్తున్నాయి. ప్లాస్టిక్ నిషేధం అమల్లోకి వచ్చి రెండేళ్లు గడిచిన విషయం విధితమే. అయినా ఎక్కడా మార్పు కనిపించడం లేదు. ప్లాస్టిక్ వినియోగంతో అనర్థాలు తప్పవని పర్యావరణ వేత్తలు హెచ్చరిస్తున్నా ఎవరికీ చెవికెక్కడం లేదు. తాజాగా సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ వస్తువులు, పాలిథిన్ కవర్లను పూర్తిగా అరికట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశాలు జారీ చేసిన విషయం విధితమే. జూట్, క్లాత్ బ్యాగ్‌ల వినియోగాన్ని పెంచాలని, ప్లాస్టిక్ భూతాన్ని తరిమికొట్టాలని ఆయన పిలుపునిచ్చారు. 90 రోజుల్లో రీ సైక్లింగ్, చెత్తను వేరు చేయడంపై పకడ్బందీ కార్యాచరణ ప్రణాళిక ఇవ్వాలని సూచించారు. దీనిపై మున్సిపల్ పరిపాలనా విభాగం కూడా మున్సిపాలిటీలకు ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లాను ప్లాస్టిక్ రహితంగా తీర్చిదిద్దాలని సూచించింది. అయితే ఎన్నో ఏళ్లుగా ప్లాస్టిక్‌పై నిషేధం ఉన్నప్పటికీ అమలులో అధికార యంత్రాంగం పూర్తిగా విఫలమవుతోంది. ఈ నేపథ్యంలో అక్టోబరు నాటికే సంపూర్ణ ప్లాస్టిక్ నిషేధం పూర్తిస్థాయిలో అమలవుతుందా? సిఎం సంకల్పం నెరవేరుతుందా? అనేది ప్రశ్నార్థకంగా మారింది.

సర్వం ప్లాస్టిక్ మయం...

స్వచ్ఛభారత్‌లో భాగంగా 2018లో అప్పటి టిడిపి ప్రభుత్వం ప్లాస్టిక్‌పై నిషేధాన్ని అమల్లోకి తెచ్చింది. జిల్లాలో పల్లె, పట్టణం తేడా లేకుండా ఎక్కడ చూసినా 80 శాతం మేర సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ కవర్ల వ్యర్థాలే దర్శనమిసున్నాయి. ముఖ్యంగా జిల్లా కేంద్రమైన రాజమహేంద్రవరంలో డ్రెయినేజీలో నీరు స్తంభించడానికి ప్లాస్టిక్ వ్యర్థాలే కారణమనేది సుస్పష్టం. ప్రస్తుత రోజుల్లో టిఫిన్ షాపులు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లలోనూ సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్‌నే వినియోగిస్తున్నారు. ప్రధానంగా పార్శిల్స్‌కు వాటినే ఎక్కువగా ఉపయోగిస్తున్నారు. అవి వేడి ఆహార పదార్థాల్లో కలిసి శరీరంలో క్యాన్సర్ కారకాలుగా మారుతున్నట్లు ఇటీవల ఓ అధ్యయనంలో తేలింది. తల్లి గర్భంలోనూ ప్లాస్టిక్ మైక్రో రేణువులు అధికంగా ఉంటున్నాయని తెలిసింది. పుట్టబోయే బిడ్డలపై కూడా ప్లాస్టిక్ ప్రభావం పడుతున్నా.. క్షేత్రస్థాయిలో వాటి నిషేధం కార్యరూపం దాల్చడం లేదు. ప్లాస్టిక్‌కు భూమిలో కరిగే స్వభావం ప్లాస్టిక్‌కు లేదు. దీంతో అది భూతాపాన్ని పెంచుతుంది. పర్యావరణానికి తీవ్ర ముప్పు పొంచి ఉన్నా.. ప్లాస్టిక్, పాలిథిన్ కవర్ల నిషేధానికి చర్యలు కానరావడం లేదు. నగరంలో తోపుడు బండ్ల నుంచి దుకాణాల వరకు ప్లాస్టిక్ కవర్లు విక్రయిస్తూనే ఉన్నారు. బార్లు, డాబాల్లో సైతం ప్లాస్టిక్ గ్లాసులు వాడేస్తున్నారు. కొన్ని డాబాలు, బార్లలో పలుచైన గ్లాసులు మద్యం తాగడానికి ఇస్తున్నారు.

16 రకాల ప్లాస్టిక్‌పై నిషేధం

ప్లాస్టిక్ వినియోగంతో పర్యావరణ సమతుల్యత దెబ్బతింటుందని అంతర్జాతీయంగా పర్యావరణ నిపుణులు హెచ్చరించటతో ఎట్టకేలకు కేంద్ర ప్రభుత్వం ప్లాస్టిక్‌పై పూర్తి స్థాయి నిషేధం ప్రకటించింది. 16 రకాలైన సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులపై కేంద్రం నిషేధం విధించింది. రెండేళ్ల క్రితమే నిషేధం అమల్లోకి వచ్చింది. ప్లాస్టిక్ ముడి పదార్థాలను సరఫరా చేయొద్దని పెట్రో కెమికల్ సంస్థలను సైతం కేంద్రం ఆదేశాలు వెలువడ్డాయి. ఈ ఆదేశాలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఉన్నతాధికారులు హెచ్చరించారు. నిషేధించిన ప్లాస్టిక్ వస్తువుల జాబితాలో ఇయర్ బడ్స్, బెలూన్లు, క్యాండీ, ఐస్‌క్రీమ్ కోసం వాడే ప్లాస్టిక్ పుల్లలు, ప్లాస్టిక్ ప్లేట్లు, కప్పులు, గ్లాసులు, ఫోర్కులు, చెంచాలు, కత్తులు, ట్రేలు, ప్లాస్టిక్ స్వీట్ బాక్సులు, ఆహ్వానపత్రాలు, సిగరెట్ ప్యాకెట్లు, వంద మైక్రాన్ల లోపు ఉండే పివిసి బ్యానర్లు, అలంకరణ కోసం వాడే థర్మాకోల్ వంటివి ఉన్నాయి.

ఆచరణ సాధ్యమేనా?

ప్రస్తుతం అందుబాటులో ఉన్న ప్లాస్టిక్ వస్తువులు, పాలిథిన్ కవర్లు, ఇతర సామగ్రిని నిషేధించేందుకు వర్తక వ్యాపారులతో సమావేశం నిర్వహించాల్సి ఉంది. అంతేకాకుండా సింగిల్‌యూజ్డ్ ప్లాస్టిక్‌ను తయారు చేసే యంత్రాలను తక్షణమే బ్యాన్ చేయాలి. ఇప్పటికే నిల్వ ఉన్న సామగ్రిని గుర్తించి స్వాధీనం చేసుకోవాలి. గ్రామస్థాయి నుంచి పట్టణాల వరకు ప్లాస్టిక్ వినియోగంతో జరిగే అనర్థాలపై ప్రజలకు పూర్తిస్థాయి అవగాహన కల్పించాల్సి ఉంది. ఈ చర్యలేవీ చేపట్టకుంటే నిషేధం ఒట్టిమాటగానే మిగులుతుంది. ప్లాస్టిక్‌ను నమ్ముకుని ఎంతో మంది వ్యాపారాలు నిర్వహించుకుంటూ ఉపాధి పొందుతున్నారు. ఇటువంటి వ్యాపారులతో సమావేశమై ప్రత్యామ్నాయ పద్ధతులను అవలంభించాలి, వారి ఉపాధికి ప్రత్యామ్నాయం చూపాలి లేకుంటే వారి కుటుంబాలన్నీ వీధిన పడే పరిస్థితి వస్తుంది.

ప్రోత్సాహకాలు ప్రకటించనున్న ప్రభుత్వం...

సింగిల్‌యూజ్డ్ ప్లాస్టిక్, పాలిథిన్ కవర్లను నిషేధించి జూట్, క్లాత్ బ్యాగ్‌లు వినియోగాలను పెంచుతూ.. అత్యుత్తమ పనితీరు కనబరిచే మున్సిపాలిటీలు, నగర పంచాయతీలకు ప్రోత్సాహకాలు ఇస్తామని ముఖ్యమంత్రి ప్రకటించారు. అక్టోబరు 2 నుంచి స్వచ్ఛతా అవార్డులు ఇవ్వాలని నిర్ణయించారు. ఈ మేరకు స్థానిక సంస్థలు, డ్వాక్రా సంఘాలు, అంగన్‌వాడీలు, పాఠశాలలు, కళాశాలలు, బస్టాండ్లు, ఆసుపత్రులు, ఎన్‌జిఒలు, వివిధ స్వచ్ఛంద సంస్థలకు అవార్డులు ఇవ్వనున్నారు.

సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

నేడు అఖండ గోదావరి ప్రాజెక్టుకు శంకుస్థాపన

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

నేడు అఖండ గోదావరి పర్యాటక ప్రాజెక్టుకు కేంద్ర మంత్రి, డిప్యూటి సిఎం శంకుస్థాపన చేస్తారని కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. బుధవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో అఖండ గోదావరి తదితర ప్రాజెక్టుల శంకుస్థాపన నేపథ్యంలో ముందస్తు ఏర్పాట్లపై ఎస్‌పి డి.నరసింహకిషోర్‌తో కలిసి ఆమె సమీక్ష నిర్వహించారు. గురువారం ఉదయం పుష్కర ఘాట్ లో అఖండ గోదావరి ప్రాజెక్టుకు మంత్రులు శంకుస్థాపన చేస్తారని చెప్పారు. అనంతరం బొమ్మూరులోని సైన్స్ మ్యూజియాన్ని ప్రారంభి స్తారన్నారు. అలాగే దివాన్ చెరువులో అటవీ అకాడమీ భవనానికి శంకుస్థాపన చేస్తారన్నారు. ఈ నేపథ్యంలో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. ఎవరికి కేటాయించిన బాధ్యతను వారు సక్రమంగా నిర్వర్తించాలని కలెక్టర్ స్పష్టం చేశారు.

పర్యావరణ హితంగా కార్యక్రమాన్ని ప్లాస్టిక్ రహితంగా నిర్వహించాలని, మంచినీటికి ప్లాస్టిక్ సీసాలను వినియోగించకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని ఆర్ఎంసి అధికారులకు సూచించారు. పుష్కర్ ఘాట్‌లో గజ ఈతగాళ్లను, రెస్క్యూ బోట్లను అందుబాటులో ఉంచాలని చెప్పారు. ఎలక్ట్రిక్ సేఫ్టీ సర్టిఫికెట్లను, డిజాస్టర్ సేఫ్టీ సర్టిఫికెట్లను తీసుకోవాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ఎస్‌పి నరసింహ కిషోర్ మాట్లాడుతూ... భద్రత విషయంలో పోలీసు అధికారులు చేపట్టే చర్యలకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఒ టి.సీతారామమూర్తి, అడిషనల్ ఎస్‌పి డి.మురళీకృష్ణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాస్త్ర సాంకేతిక మండలి సభ్య కార్యదర్శి ప్రొఫెసర్ శరత్‌కుమార్, ఆర్‌డిఒ ఆర్.కృష్ణనాయక్, జిల్లా అటవీ శాఖ అధికారి ప్రభాకర్‌రావు, ఎస్‌డిసి గెయిల్ ప్రేమ్ కుమార్, ఎపి కాస్ట్ డైరెక్టర్ డాక్టర్ పిఎస్.శ్రీనివాస్‌బాబు, టూరిజం అధికారి పి.వెంకటాచలం, డిఎంహెచ్ఒ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం డబ్బులు వెంటనే జమ చేయాలి

ప్రజాశక్తి - చాగల్లు

రైతులకు ధాన్యం డబ్బులు వెంటనే జమ చేయాలని రైతు సంఘం జిల్లా కన్వీనర్ గారపాటి వెంకటసుబ్బారావు డిమాండ్ చేశారు. రైతులకు రావాల్సిన రూ.107 కోట్లను ప్రభుత్వం వెంటనే విడుదల చేసి రైతుల ఖాతాలకు జమేయాలన్నారు. ధాన్యం బకాయిల కోసం రైతు సేవా కేంద్రాలు, బ్యాంకుల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నారన్నారు. వ్యవసాయ శాఖ అధికారిని కలిస్తే రెండు మూడు రోజుల పడతాయని చెబుతున్నారని, కాని సొమ్ములు మాత్రం జమ కావట్లేదన్నారు. స్థానిక తహశీల్దార్‌కు వినతిపత్రం ఇచ్చినా స్పందన ఉండట్లేదన్నారు. జిల్లాలో కౌలు రైతులు పరిస్థితి మరీ దయనీయంగా ఉందన్నారు. ప్రభుత్వ సాయం లేక, రుణాలు అందక ప్రయివేటు వ్యాపారుల వద్ద వడ్డీకి అప్పులు చేసి పంటలు పండిస్తున్నారన్నారు. అలాంటి రైతులకు కూడా బకాయిలు చెల్లించకుండా వేధించడం తగదన్నారు. రైతులను ఇలా ఇబ్బందులకు గురి చేయడమే రైతు ప్రభుత్వమా? అని ఆయన ప్రశ్నించారు. ఇప్పటికైన సంబంధిత శాఖల అధికారులు స్పందించి రైతులకు న్యాయం చేయాలని కోరారు.

వినతిపత్రం అందిస్తున్న సిపిఎం నాయకులు

ఫీజులను నియంత్రించాలి

ప్రజాశక్తి - నిడదవోలు రూరల్

నిడదవోలు పట్టణ పరిసర ప్రాంతాల్లోని ప్రయివేటు విద్యాసంస్థల్లో ఫీజులను నియంత్రించాలని ఎంఇఒకు సిపిఎం నాయకులు బుధవారం వినతిపత్రం అందించారు. సందర్భంగా సిపిఎం నాయకులు జువ్వల రాంబాబు మాట్లాడారు. ప్రయివేటు విద్యా సంస్థల్లో ప్రభుత్వం ఫీజుల నియంత్రణ చట్టాలను కఠినంగా అమలు చేయాలన్నారు. జిఒ 53,54 ప్రకారం ప్రభుత్వం నిర్ణయించిన ఫీజులనే వసూలు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. పుస్తకాలు, స్టేషనరీ, యూనిఫాం అమ్మకాలను అరికట్టాలన్నారు. నిబంధనల మేరకు నర్సరీ నుంచి 5వ తరగతి వరకు రూ.11వేలు ఫీజు ఉండగా ప్రయివేటు విద్యాసంస్థల్లో రూ.15 వేల నుంచి రూ.20 వేలకు పైగా వసూలు చేస్తున్నారన్నారు. 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు నిబంధనల ప్రకారం రూ.15 వేలు ఉండగా రూ.20 వేల నుంచి రూ.65 వేల వరకూ వసూలు చేస్తున్నారని తెలిపారు. జూనియర్ కళాశాలలో బైపిసి, ఎంపిసి విభాగాలకు రూ.17వేలు ఫీజు ఉండగా రూ.లక్ష నుంచి రూ.1.50లక్షల వరకూ వసూలు చేస్తున్నారని, హాస్టల్ అయితే మరో రూ.50వేలను అదనంగా వసూలు చేస్తున్నారని తెలిపారు. తల్లిదండ్రులు ఐక్యంగా ఉండి ఈ దోపిడీకి వ్యతిరేకంగా పోరాడాలని ఆయన పిలుపునిచ్చారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో గారపాటి ప్రసన్నకృష్ణ తదితరులున్నారు

జిల్లాను వీడని ముసురు

ప్రజాశక్తి -కొవ్వూరు

జిల్లాలను ముసురు వీడట్లేదు. గడిచిన 24 గంటల్లో గరిష్టంగా ఉండ్రాజవరంలో 11.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయ్యింది. కనిష్టంగా బిక్కవోలు, రాజానగరం మండలాల్లో 4.8 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. పెరవలిలో 11, నిడదవోలులో 8.4, కోరుకొండలో 8.2, గోకవరం, రంగంపేట మండలాల్లో 7.8 మిల్లీమీటర్లు చొప్పున, రాజమహేంద్ర వరం రూరల్‌లో 6.6, గోపాలపురం సీతానగరం మండలాల్లో 6.4 మిల్లీమీటర్లు చొప్పున, చాగల్లు, కొవ్వూరు, రాజమహేంద్రవరం అర్బన్‌లో 6.2, దేవరపల్లిలో 6, అనపర్తిలో 5.4, కడియం, నల్లజర్ల, తాళ్లపూడిలో 5.2 మిల్లీమీటర్ల చొప్పున వర్షపాతం నమోదైంది. జిల్లా వ్యాప్తంగా బుధవారం తెల్లవారు జాము నుంచి వర్షం కురుస్తూనే ఉంది. దీంతో జనజీవనం స్తంభించింది. కొవ్వూరు పట్టణంలో పలు లోతట్టు ప్రాంతాల్లో వర్షపు నీరు నిలిచిపోయింది.

తాళ్లపూడి : మండలంలో భారీ వర్షం కురిసింది. ఈ వర్షం కారణంగా తాళ్లపూడి మెయిన్ రోడ్డు బురదమయంగా మారింది. వాహనదారులతో పాటు పాదచారులు సైతం నడవడానికి ఇబ్బందులు పడ్డారు. భవన యజమానులు డ్రెయినేజీలను ఆక్రమించడంతో వర్షపు నీరు రోడ్లపైనే నిలిచిపోతోంది. వర్షం కారణంగా కొనుగోలుదారులు లేక వ్యాపార సముదాయాలు వెలవెలబోయాయి. వర్షంతో మండలంలో సార్వా పనులు వేగంగా సాగుతున్నాయి.

తాళ్లపూడిలో రోడ్డుపై నిలిచిన నీరు

ఊపందుకున్న వ్యవసాయ పనులు

ఉండ్రాజవరం : వర్షాలు విస్తారంగా కురవడంతో మండలంలో వ్యవసాయ పనులు ప్రారంభమయ్యాయి. దమ్ములు, నాట్ల పనులు వేగంగా జరుగుతున్నాయి. మండలంలో 4,782 హెక్టార్లలో ఇప్పటికి వరకూ 12 హెక్టార్లలో నాట్లు పడ్డాయి. పిఎల్‌వి 1100, స్వర్ణ, ఎంటియు 1318 రకాలను ఎక్కువగా సాగుచేస్తున్నారని ఎఒ బి.రాజారావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన రైతులకు పలు సూచనలు చేశారు. నారుమడి 10 -12 రోజులు ముందే దమ్ము చేసి చదును చేయాలన్నారు. 5 సెంట్ల నారు మడికి 2 కిలోల నత్రజని(1 కిలో విత్తనం చల్లేముందు, మరో కిలో విత్తిన 12 నుంచి 14 రోజులుకు), 1 కిలో భాస్వరం, 1కిలో పొటాష్ నిచ్చే ఎరువులను దుక్కిలో వేయాలన్నారు. చలి ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో భాస్వరం రెట్టింపు వేయాలన్నారు. మొలకలకట్టిన విత్తనాన్ని సెంటుకు 5 కిలోల చొప్పున చల్లుకోవాలన్నారు. నారు పూరిగా పురివిచ్చుకునే వరకు ఆరు తడులు ఇచ్చి, తర్వాత పలుచగా నీరు నిలకట్టాలన్నారు. జింకు లోపం ఉంటే లీటరు నీటికి 2 గ్రాముల జింకు ద్రావణాన్ని కలిపి పిచికారీ చేయాలన్నారు. విత్తిన 10 రోజులకు కార్బో ఫ్యూరాన్ 3జి గుళికలు సెంటు నారుమడికి 160 గ్రాముల చొప్పున వేయాలన్నారు. లేదా మోనో క్రోటోఫాస్ 1.6 మిల్లీలీటరు లేక క్లోరి పైరిఫాస్ 2 మిల్లీ లీటరు నీటిలో కలిపి విత్తిన 10 రోజులకు, 17 రోజులకు పిచికారీ చేయాలన్నారు. నారు తీయడానికి 7 రోజుల ముందు సెంటు నారుమడికి 160 గ్రాముల కార్బో ఫ్యూరాన్ గుళికలు తక్కువ నీటిలో వేయాలన్నారు. తల్లి పురుగులు గుడ్లను కొసల మీద పెడుతుంది కనుక నారు నాటేటప్పుడు కొసలు విరిచి, నాటితే గుడ్లను నిర్మూలించొచ్చన్నారు.

నాట్లు వేస్తున్న కూలీలు

రోడ్లపై గోతులను పూడ్చాలి

ప్రజాశక్తి - చాగల్లు

నిడదవోలు టు పంగిడి ఆర్ అండ్ బి రోడ్డు కుటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత గోతులు పూడ్చిన అధిక లోడ్ క్వారీ లారీలు వెళ్లడంతో రోడ్లు పాడైపోయాయని స్థానికులు తెలిపారు. చాగల్లు మండలం బ్రాహ్మణగూడెం టు మీనా నగరం వరకు సిసి రోడ్లకు తారు రోడ్లకు మధ్య భారీ గోతుల పడ్డాయని, వెంటనే గోతులు పూడ్చకపోతే ఈ వర్షాకాలం రోడ్లు మరింత పాడైపోతాయని స్థానికులు తెలిపారు. కావున సంబంధిత ఆర్ అండ్ బి అధికారులు గోతుల పూడ్చి ప్రమాదం లేకుండా చూడాలని వర్షాకాలం కావడంతో ఏది గుంతో, ఏది వర్షపు నీరో తెలియక వాహన దారులు తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారన్నారు.

గ్రామాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

ప్రజాశక్తి-కడియం

శంకుస్థాపన చేస్తున్న ఎంఎల్ఎ గోరంట్ల

కూటమి ప్రభుత్వం గ్రామాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించిందని, దీనిలో అందరూ భాగస్వాములు కావాలని రూరల్ ఎంఎల్‌ఎ గోరంట్ల బుచ్చయ్యచౌదరి అన్నారు. బుధవారం ఆయన కడియం మండలంలోని పలు గ్రామాల్లో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. వేమగిరిలో సుమారు రూ.30 లక్షలతో నిర్మించే సిసి డ్రెయినేజీ, రూ.25 లక్షలతో పొట్టిలంకలో నిర్మించే సిసి డ్రెయిన్, మురమండలో రూ.30 లక్షలతో నిర్మించే సిసి రోడ్లు, జేగురుపాడులో రూ.50 లక్షలతో నిర్మించే సిసి రోడ్డుకు, దుళ్లలో రూ.40 లక్షలతో నిర్మించే సిసి రోడ్డు, రూ.37లక్షలతో నిర్మించే మరో సిసి రోడ్డు నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి వెలుగుబంటి ప్రసాద్, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ప్రధాన రహదారిపై టెంట్లు వేస్తే జరిమానా

ప్రజాశక్తి - సీతానగరం

సీతానగరం నుంచి బొబ్బిల్లంక గ్రామం వరకు ఉన్న ఆర్ అండ్ బి రహదారిపై శుభకార్యాల నిమిత్తం టెంట్లు వేస్తే జరిమానా విధించాలని ఎంపిడిఒ భారతి పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. రోడ్డుపై టెంట్లు వేయడం వల్ల ప్రయాణికులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని బుధవారం ప్రజాప్రతినిధులు ఆమె దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై ఆమె స్పందించారు. దీనికి ప్రజలు సహకరించాలన్నారు.

ట్రిపుల్ ఐటికి ఐదుగురు ఎంపిక

ప్రజాశక్తి - తాళ్లపూడి

తాళ్లపూడి మండలానికి చెందిన ఐదుగురు విద్యార్థులు ట్రిపుల్ ఐటిలో సీట్లు సాధించారని తాళ్లపూడి ఎంఇఒ సిహెచ్.బాలామణి తెలిపారు. ఎస్.సాత్విక్ హర్ష, ఎస్‌కె.బుష్రా నూజివీడు, వి.చరణ్‌సాయి, ఎస్‌కె.తరీఫా ఒంగోలు, అజయ్‌కుమార్ శ్రీకాకుళం ట్రిపుల్ ఐటిలో సీట్లు పొందారని తెలిపారు. మొదటి విడతలోనే ఐదుగురు విద్యార్థులు సీట్లు సాధించడం ఎంతో గర్వకారణంగా ఉందన్నారు.

జల్‌జీవన్ మిషన్ పనుల పరిశీలన

ప్రజాశక్తి - సీతానగరం

సింగవరం గ్రామ పంచాయతీ నాగరత్నం కాలనీలో జల్ జీవన్ మిషన్ కింద చేపట్టిన పనులను కేంద్ర బృందం బుధవారం పరిశీలించింది. ఈ కమిటీలో ఫైనాన్స్ డిప్యూటీ సెక్రటరీ గరిమా కపూర్, టెక్నికల్ ఆఫీసర్, సెంట్రల్ గ్రౌండ్ వాటర్ బోర్డు లక్ష్మీనారాయణ దామోదర, టెక్నికల్ ఆఫీసర్ సెంట్రల్ వాటర్ కమిషన్ మన్నూజీ ఉపాధ్యాయ ఉన్నారు. తనిఖీలో భాగంగా సింగవరం గ్రామంలో రూ.20.70 లక్షలతో చేపట్టిన పనులను పరిశీలించారు. ముఖ్యంగా ఇంటింటికి ఇచ్చిన ట్యాప్ కనెక్షన్లను బృందం పరిశీలించింది. లబ్ధిదారులతో విలేజ్ వాటర్ అండ్ శానిటేషన్ కమిటీ సభ్యులతో, గ్రామ ప్రజలతో బృందం సభ్యులు నేరుగా మాట్లాడారు. ఫీల్డ్ టెస్ట్ కిట్‌లతో నీటి నాణ్యతా పరీక్షలు జరిగే విధానాన్ని కూడా కేంద్ర బందం పరిశీలించింది. జరిగిన పనుల తీరు పట్ల సంతృప్తి వ్యక్తం చేసి సర్పంచ్ సంగన చినపోస్సియ్యని అభినందించింది. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి డి.విజయదుర్గ, ఆర్‌డబ్ల్యూఎస్ ఇఇ బివి.గిరి, డిఇఇ రవికుమార్, ఎఇఇలు వివిఎస్-ఎస్.ప్రకాష్, వి.అవినాష్, గ్రామ పెద్దలు, సచివాలయ సిబ్బంది, ఆశ వర్కర్లు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

కుళాయిలను పరిశీలిస్తున్న కేంద్ర బృందం సభ్యులు

కార్టూ'నిజం'



జగన్‌పై మరో కేసు

గురుకులం విద్యార్థులకు ట్రిపుల్ ఐటిలో సీట్లు

ప్రజాశక్తి - గోకవరం

విద్యార్థులను సత్కరిస్తున్న ఎంఎల్ఎ గోరంట్ల బుచ్చయ్య చౌదరి

భూపతిపాలెం గురుకుల పాఠశాల విద్యార్థులు ట్రిపుల్ ఐటిలో సీట్లు సాధించారు. ఈ పాఠశాలలో చదువుకున్న జగ్గంపేట మండలం మల్లిసాలకు చెందిన పి.తేజశ్రీనాగుకి ఒంగోలు ట్రిపుల్ ఐటి క్యాంపస్, కొత్తపల్లి గ్రామానికి చెందిన ఎం.బాలరాజేష్ ఒంగోలు ట్రిపుల్ ఐటి క్యాంపస్, మల్లవరం గ్రామానికి చెందిన పి.మనోహర్ శ్రీకాకుళం ట్రిపుల్ ఐటి క్యాంపస్ సీట్లు సాధించారు. వీరిని జగ్గంపేట ఎంఎల్‌ఎ జ్యోతుల నెహ్రూ ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే భూపతిపాలెం స్కూల్ నుంచి ఐదుగురు విద్యార్థులకు ప్రతిభా అవార్డును, రూ.20వేల నగదు అందించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ జ్యోతుల నెహ్రూ మాట్లాడుతూ భూపతిపాలెం రెసిడెన్షియల్ స్కూలుకు కావాల్సిన అన్ని సౌకర్యాలు సమకూరుస్తూ ఈ విద్యా సంవత్సరంలో అనేకసార్లు భూపతిపాలెం స్కూల్‌కు వెళ్లి విద్యార్థుల యోగక్షేమాలు, వసతి వారి చదువులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టామన్నారు. నూటికి నూరు శాతం ఉత్తీర్ణతతో మంచి ఫలితాలను సాధించారన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ కొత్త కొండబాబు, మార్కెట్ కమిటీ చైర్మన్ అడపా భరత్ కుమార్, టిడిపి జగ్గంపేట మండల అధ్యక్షులు మారిశెట్టి భద్రం, భూపతిపాలెం స్కూల్ చైర్మన్ గల్లా రామచంద్రరావు, రేఖ బుల్లిరాజు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

దాడుల నుంచి రక్షణపై అవగాహన

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

దాడుల నుంచి ఎలా రక్షణ పొందాలనే విషయంపై మహిళలు శక్తి టీమ్ సభ్యులు అవగాహన కల్పించారు. ఎస్‌పి డి.నరసింహకిషోర్ ఆదేశాల మేరకు రాజమహేంద్రి మహిళా డిగ్రీ కళాశాలలో సెంట్రల్ జోన్ శక్తి టీం ఆధ్వర్యంలోఅవగాహనా కార్యక్రమం నిర్వహించామని శక్తి టీం జిల్లా ఇన్‌ఛార్జి నోడల్ ఆఫీసర్ కెవి.సత్యనారాయణ తెలిపారు. లైంగిక దాడులపై అవగాహన కల్పించారు. సెల్ఫ్ డిఫెన్స్ టెక్నిక్స్ గురించి, సైబర్ నేరాల గురించి, సోషల్ మీడియా యాప్స్ నష్టాల గురించి, పోక్సో చట్టం మరియు శక్తి యాప్ యొక్క ఉపయోగాల గురించి అవగాహన కల్పించారు. మహిళలు అందరూ కూడా శక్తి యాప్ డౌన్ లోడ్ చేసుకోవాలని, ఎవరికైనా ఎటువంటి ఆపద వచ్చినా, ఏ సమయంలో నైనా శక్తి యాప్ ద్వారా పోలీస్‌ల సాయం కోరొచ్చన్నారు. ఈ అవగాహన కార్యక్రమంలో మహిళా పిఎస్ ఇన్‌స్పెక్టర్ కె.మంగాదేవి, ఉమెన్ ఎస్ఐ అమీనాబేగం, సెంట్రల్ జోన్ శక్తి టీం ఇన్‌ఛార్జి ఎస్ఐ రామకృష్ణ సిబ్బంది పాల్గొన్నారు.

పూడికతీత పనుల పరిశీలన

ప్రజాశక్తి - చాగల్లు

మండలంలోని నేలటూరు, చాగల్లు గ్రామాల్లోని కొవ్వాడ కాలువ పూడికతీత పనులను బుధవారం కొవ్వూరు ఎంఎల్ఎ ముప్పిడి వెంకటేశ్వరరావు పరిశీలించారు. వర్షాలు పడుతున్నందున రైతులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా పనులను త్వరగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్లు, ఇరిగేషన్ డిఇని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి చైర్మన్ నాదల శ్రీరామ్‌చౌదరి, టిడిపి నాయకులు పాల్గొన్నారు

నేరాలు ఘోరాలు

ఎసిబికి చిక్కిన విఆర్ఒ

ప్రజాశక్తి - ఉప్పలగుప్తం

పట్టాదారు పాస్ పుస్తకం ఇచ్చేందుకు రూ.20 వేలు లంచం తీసుకుంటూ విఆర్ఒ ఎసిబి చిక్కాడు. మండలంలోని చల్లపల్లి చింతలచెరువు సచివాలయంలో గ్రేడ్-1 విఆర్ఒగా పనిచేస్తున్న పరసా శ్రీమన్నారాయణ తన తల్లి పేర కొనుగోలు చేసిన భూమికి పట్టాదారు పాస్ బుక్ ఇచ్చేందుకు కొంత సొమ్ము తీసుకుని ఇంకా రూ.20 వేలు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నట్లు రైతు శ్రీరామ్ ఎసిబి అధికారులను ఆశ్రయించారు. దీంతో బుధవారం విఆర్ఒ శ్రీమన్నారాయణ ఇంటి వద్ద రైతు రూ.20 వేలు లంచం ఇస్తుండగా ఎసిబి అధికారులు దాడి చేసి విఆర్ఒను అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి విఆర్ఒను జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించనున్నట్టు ఎసిబి అధికారులు తెలిపారు.

హత్యాయత్నం కేసులో ఐదుగురికి రిమాండ్

ప్రజాశక్తి - కపిలేశ్వరపురం

హత్యాయత్నం కేసులో ఐదుగురికి ఆలమూరు జెఎఫ్ సిఎం కోర్టు న్యాయమూర్తి బుధవారం రిమాండ్ విధించినట్లు అంగర ఎస్ఐ జి.హరీష్‌కుమార్ తెలిపారు. ఈ నెల 22న వడ్లమూరు గ్రామంలో పాత గొడవల నేపథ్యంలో కొంతమంది గ్రూపుగా ఏర్పడి ముగ్గురిపై దాడి చేశారు. ఈ దాడిపై కేసు నమోదు చేసి ఈ దాడికి కారణమైన కొల్లాటి సురేష్‌తోపాటు, మరో నలుగురిని అరెస్టు చేసి కోర్టులో ప్రవేశపెట్టగా న్యాయమూర్తి వారిక రిమాండ్ విధించినట్లు ఎస్ఐ తెలిపారు.

ఇసుక లారీ సీజ్

ప్రజాశక్తి - తాళ్లపూడి

ఎటువంటి బిల్లులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న లారీని స్వాధీనం చేసుకున్నామని కొవ్వూరు డివిజన్ టాస్క్ ఫోర్స్ ఎఎస్ఐ గంగాధరరావు తెలిపారు. తాళ్లపూడి బోట్ మెన్ సొసైటీ వద్ద లోడ్ చేసుకుని సుమారు 20 టన్నుల ఇసుకతో తాళ్లపూడి మండలం నుంచి వెళుతున్న లారీని గజ్జరం గ్రామం వద్ద పట్టుకుని తాళ్లపూడి పోలీస్ స్టేషన్‌కు తరలించామని తెలిపారు.

బాలిక ఆచూకీ గుర్తింపు

ప్రజాశక్తి - సీతానగరం

కడప జిల్లా ప్రొద్దుటూరుకు చెందిన 16 బాలిక పసల అర్పణ అచూకీని సీతానగరం పోలీసులు కనుగొన్నారు. ఎస్ఐ డి.రామ్‌కుమార్ తెలిపిన వివరాల మేరకు తన తండ్రి అరుణ్‌బాబు మందలించాడనే కోపంతో అర్పణ ఇంటి నుంచి బయటకు వచ్చింది. సీతానగరం గ్రామానికి చేరుకున్న ఆమెను స్థానికుల సాయంతో గుర్తించారు. వివరాలు సేకరించిన అనంతరం బాలికకు కౌన్సిలింగ్ ఇచ్చారు. ఆమె తల్లిదండ్రులకు సమాచారం అందించారు. బాలికను రాజమండ్రి చైల్డ్ వెల్ఫేర్ సంరక్షణకు పంపించినట్లు పోలీసులు తెలిపారు.

హుండీల చోరీ కేసులో ఇద్దరు అరెస్టు

ప్రజాశక్తి-కడియం

కడియం పోస్ట్ ఆఫీస్ వీధిలో గల శ్రీ లక్ష్మీ గణపతి గుడిలో గల హుండీని మే 31 రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు పగులగొట్టి డబ్బులను దొంగిలించారు. ఆలయ కమిటీ సభ్యులు పిర్యాదు మేరకు కడియం పోలీసులు కేసు నమోదు చేశారు. కడియం దేవి సెంటర్ వద్ద బుధవారం అనుమానంగా తిరుగుతున్న, రాజమహేంద్రవరానికి చెందిన కసినికోట బాల పోసిగణేష్, మరో మైనర్‌ను అరెస్టు చేశారు. విచారణలో నేరం ఒప్పుకోవడంతో వారిని కోర్టుకు తరలించామని బి.నాగదుర్గాప్రసాద్ తెలిపారు.

పంట కాలువల్లో పూడిక తొలగింపు

ప్రజాశక్తి - రామచంద్రపురం

రామచంద్రపురం డివిజన్లోని ఇంజరం కెనాల్‌లో పలుచోట్ల చెత్తాచెదారం తొలగించి శుభ్రపరిచినట్లు ఇరిగేషన్ ఎఇ వి.సుజాత తెలిపారు. నిధులు లేకపోయినా రైతు సంఘాల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని తలపెట్టినట్లు తెలిపారు. గత దాళ్వాలోనూ ఇంజనీరింగ్ కెనాల్‌ను శుభ్రపరిచామని ఆమె వివరించారు. దీంతో సాగునీటికి ప్రవాహానికి ఇబ్బందులు ఉండవని ఆమె తెలిపారు.

2న కె.గంగవరం మండల సమావేశం

ప్రజాశక్తి -కె.గంగవరం

జూలై 2వ తేదీన మండల మండల పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం జరుగుతుందని ఎంపిడిఒ ఎన్.శ్రీనివాస్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపిపి పంపని నాగమణి అధ్యక్షతన బుధవారం ఉదయం 10 గంటలకు సమావేశం జరుగుతుందని, ఎంపిటిసి సభ్యులు, సర్పంచులు, అధికారులు సమావేశానికి సకాలంలో హాజరుకావాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

సొంత మండలాల్లో పనిచేసే అవకాశం ఇవ్వాలి

ప్రజాశక్తి - గోపాలపురం

సచివాలయ ఉద్యోగులకు సొంత మండలాల్లో పనిచేసుకునేందుకు అవకాశం కల్పించాలని సచివాలయ ఉద్యోగులు కోరారు. బుధవారం ఆంధ్రప్రదేశ్ నాన్ గెజిటెడ్ మరియు గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ తాలూకా అధ్యక్షులు జోడాల వెంకటేశ్వర రావు ఆధ్వర్యంలో ఎంపిడిఒ రాజ్‌మనోహర్‌కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. రెండున్నరేళ్లుగా నేషనల్ ఇంక్రిమెంట్లు ఇవ్వలేదని, స్పష్టమైన ప్రమోషన్ ఛానల్ కల్పించి, రేషనలైజేషన్ ప్రక్రియ ద్వారా ఏర్పడిన మిగులు సిబ్బందిని ప్రభుత్వం ఏ విధంగా వినియోగించుకుంటుందనే విషయంపై స్పష్టత ఇవ్వాలన్నారు. సచివాలయ ఉద్యోగులు తమ సొంత మండలాల్లో పని చేసుకునేందుకు అవకాశం కల్పించాలని కోరారు. జెఎసి చైర్మన్ ఎపి ఎన్‌జిఒ అధ్యక్షులు జోడాల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలన్నారు. తక్కువ వేతనంతో ఇతర మండలాల్లో చేయాలంటే తమ కుటుంబాలు ఆర్థికంగా ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. సచివాలయం ఉద్యోగులకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ వైస్ ప్రెసిడెంట్ కె.తారకరమేష్, ట్రెజరర్ జి.అనిల్‌కుమార్, డిజిటల్ అసిస్టెంట్, సర్వే అసిస్టెంట్లు, వ్యవసాయ సహాయకులు, వెల్ఫేర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

మైనింగ్ మాఫియా అక్రమాలపై హైకోర్టు కన్నెర్ర

ప్రజాశక్తి - పి.గన్నవరం

పి.గన్నవరం మండల పరిధిలో ఉంచిన ఇసుక నిల్వలు

జనసేన ఎంఎల్ఎ ప్రాతినిథ్యం వహిస్తున్న పి.గన్నవరం నియోజకవర్గంలో జరుగుతున్న మైనింగ్ మాఫియా అక్రమాలపై హైకోర్టు కన్నెర్ర చేసింది. నియోజక వర్గంలో అడ్డూఅదుపూ లేకుండా విచ్చలవిడిగా సాగిపోతున్న మైనింగ్ దోపిడీపై నివేదిక సమర్పించాలని చీఫ్ జస్టిస్ నుంచి కలెక్టర్‌కు ఆదేశాలు రావడంతో స్థానికంగా కలకలం రేగింది. దీంతో రాత్రీ పగలూ తేడాలేకుండా చెలరేగిపోతున్న కూటమి నాయకుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. ఇంతకాలం మొద్దునిద్రపోతున్న అధికారులు తలలు పట్టుకుంటున్నారు.

నియోజక వర్గంలోని నదీ పరీవాహక ప్రాంతాల్లో నిబంధనలను అతిక్రమించి జరుగుతున్న మైనింగ్ మాఫియా దోపిడీపై ఊడిమూడిలంక, గంటి పెదపూడి, మానేపల్లి, కందాల పాలెం గ్రామాలకు చెందిన పలువురు రైతులు గత ఏప్రిల్ 21న హైకోర్టు ప్రధాన న్యాయమూర్తికి ఆధారాలతో సహా ఫిర్యాదు చేశారు. సుమోటాగా కేసు నమోదు చేసిన హైకోర్టు సమగ్ర విచారణ చేసి నివేది ఇవ్వాలని కలెక్టర్‌ను ఆదేశించింది. హైకోర్టు నుంచి ఆదేశాలు రావడంతో మైనింగ్, రెవెన్యూ, ఇతర శాఖల అధికారులు అక్రమ తవ్వకాలపై లెక్కలు కట్టడానికి హడావిడి చేస్తున్నారు. సిఆర్‌జెడ్ ప్రాంతాల నుంచి గ్రీన్ ట్రిబ్యూనల్ నిబంధనలు ఉల్లంఘించి కూటమి నాయకుల అండదండలతో వేల టన్నుల ఇసుక, మట్టి, బొండు ఇసుకను తరలించుకు పోతున్నారు. భారీ వాహనాలతో ఇష్టారాజ్యంగా సాగిపోతున్న అక్రమ మట్టి రవాణాతో ఏటిగట్లు, పంట కాలువలపై ఉన్న వంతెనలు, రహదారులు, ధ్వంసం అవుతున్నాయి. నియోజకవర్గంలో పలు ప్రదేశాల్లో పెద్ద పెద్ద కొండలను తలపించే విధంగా నిల్వ చేసి ధనికులు సైతం కొనలేని రేట్లకు అమ్ముకుంటూ కోట్ల రూపాయలు కూడబెడుతున్నారు. అక్రమ పద్ధతుల్లో ప్రభుత్వ ఖజానాను కొల్లగొడుతూ ఇన్‌కం టాక్స్ చెల్లించకుండా పేట్రేగిపోతున్న మైనింగ్ మాఫియా వైపు ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు కూడా కన్నెత్తి చూడకపోవడం పట్ల విమర్శలు వినిపిస్తున్నాయి. పి.గన్నవరం నియోజవర్గ జనసేన ముఖ్య నాయకుడు, కూటమి నేతలు అక్రమార్కులకు, స్థానిక అధికారులు అండగా ఉండడంతో చర్యలు కానరావడంలేదని రైతులు హైకోర్టుకు పంపిన ఫిర్యాదులో పేర్కొన్నారు. అలాగే పంట పొలాలను, పర్యావరణాన్ని రక్షించాలంటూ రైతులు కోరారు. హైకోర్టు ఆదేశాలు తనకు అందినట్టు రైతు పుచ్చకాయల సత్యనారాయణ తెలిపారు.

అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలి

ప్రజాశక్తి - అమలాపురం

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మహేష్‌కుమార్

వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అధికారులంతా అప్రమత్తంగా వ్యవహరించాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో వర్షాలు, గోదావరి వరద, ఇతర విపత్తుల పై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విపత్తుల సహాయక చర్యల పట్ల ప్రతి శాఖ సమాయత్తం కావాలని ఆయన సూచించారు. గోదావరి తీరం వెంబడి ఉన్న మండలాలకు సంబం ధించి ప్రతి శాఖ విపత్తుల నిర్వహణ సన్నద్ధతపై కార్యాచరణ ప్రణాళికలను రచించి కావలసిన రిక్వైర్మెంట్స్‌పై జూలై మొదటి వారంలో నివేదిక కలెక్టరేట్‌కు సమర్పించాలని ఆదేశించారు. 1, 2, 3, ప్రమాద హెచ్చరికలను దృష్టిలో ఉంచుకొని ఏయే ప్రాంతాలు మొదటి హెచ్చరికకు, రెండో హెచ్చరికకు, మూడో హెచ్చరికకు, ముంపు బారిన పడతాయో సంబంధిత నివేదికలను ప్రతి శాఖకు సమర్పించడం జరుగుతుందని తెలిపారు. సుమారు 76 ఆవాసాలు ముంపు బారిన పడే అవకాశం ఉందన్నారు. కేటగిరిల వారీగా సహాయక చర్యలకు మత్స్యశాఖ బోట్లను లైఫ్ జాకెట్లను, గజ ఈతగాళ్లను నియమించాలన్నారు. డోర్ టు డోర్ సహాయక చర్యలకు పడవలను ఏర్పాటు చేయాలన్నారు. పంచాయతీరాజ్, ఆర్ అండ్ బి శాఖ అధికారులు రోడ్లు గండ్లు పడకుండా చూసుకో వాలన్నారు. ఏటిగట్టు బలహీనంగా ఉన్నచోట్ల సైనింగ్ బోర్డులను ఏర్పాటు చేస్తూ గట్లు పటిష్టతకు ఇసుక సంచులను సిద్ధం చేయాలన్నారు. మూడు నెలల పాటు ప్రతి శాఖ అప్రమత్తం కావాలన్నారు. తక్షణమే స్పందించే రాష్ట్ర విపత్తుల స్పందన దళం వృందాన్ని స్థానికంగా ఏర్పాటు చేసి ఆస్తి ప్రాణనష్టాలను పూర్తిగా నివారించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లా వైద్యారోగ్య శాఖ తమ ఆసుపత్రులలో జనరేటర్లు ఏర్పాటు చేసుకోవాలని, అత్యవసర మందులు సిద్ధం చేస్తూ అంబులెన్స్ సౌకర్యాన్ని సిద్ధపరచుకోవాలన్నారు. గతంలో సంభవించిన విపత్తులలో శాఖల మధ్య సమన్వయ లోపాలు కనిపించాయని, అటువంటి సమన్వయ లోపాలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఎస్‌పి బి.కృష్ణారావు మాట్లాడుతూ పోలీస్ శాఖ సహాయ చర్యలకు సన్నద్ధంగా ఉందని, వరదలు ఎదుర్కొనే దిశగా శాఖల సమన్వయంతో సమాయత్తం అయ్యిందన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఒ రాజకుమారి, ఆర్‌డిఒలు, జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

మలేరియా నిర్మూలనకు కృషి

ప్రజాశక్తి - ఆలమూరు

అవగాహన కల్పిస్తున్న అధికారులు

మలేరియా మహమ్మారి మనతోనే అంతం కావాలని జిల్లా మలేరియా వైద్యాధికారి నక్కా వెంకటేశ్వర రావు అన్నారు. బుధవారం మండలంలోని చొప్పెల్ల, పెదపల్ల పిహెచ్‌సిల ఆధ్వర్యంలో మలేరియా నివారణపై అవగాహన ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2007 ప్రపంచ ఆరోగ్య సమావేశంలో డబ్ల్యూహెచ్ఒ సభ్య దేశాలు ప్రతి ఏటా ఏప్రిల్ 25న ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని ప్రారంభించాయన్నారు. ప్రభుత్వ ఆదేశాలతో జూన్ 16 నుంచి జూలై 31 వరకు మలేరియా నివారణ వారోత్సవాలు జరుగుతున్నట్లు తెలిపారు. మలేరియా నివారణ, నియంత్రణ కోసం నిరంతర కృషి చేయాలన్నారు. మలేరియా నిర్మూలన దిశగా పురోగతిని వేగవంతం చేయడానికి 'మలేరియా ముగుస్తుంది మాతో' అనే నినాదాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. మలేరియా రహిత సమాజానికి చిత్తశుద్ధితో మనం అందరం కలిసికట్టుగా పాటు పడదామ న్నారు. ఈ సందర్భంగా హెల్త్ అసిస్టెంట్స్‌కి డెంగీ, మలేరియా, చికెన్ గున్యా వంటి వ్యాధులపై అవగాహన కల్పించారు. అనంతరం పిహెచ్‌సిలలో లేబరేటరీ పనితీరు, రికార్డులను తనిఖీలు చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ సాయికిషోర్, డాక్టర్ లక్ష్మీస్నేహ, డాక్టర్ అనంతరామకృష్ణ, ఆరోగ్య విస్తరణఅధికారి కె.జ్యోతికుమార్, హెల్త్ ఎడ్యుకేటర్లు బి.సూర్యనారాయణ, రాజా అక్కుల, సిహెచ్ఒ ఎంఎస్ఎన్ రెడ్డి, సబ్ యూనిట్ ఆఫీసర్ సిహెచ్.వెంకటేశ్వరరావు, ఎంపిహెచ్ఎస్‌లు శివప్రసాద్, మణి, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

బాల కార్మికులను గుర్తించేందుకు తనిఖీలు

ప్రజాశక్తి - మండపేట

తనిఖీలు చేస్తున్న అధికారుల బృందం

మండపేట, ఆలమూరు పరిధిలో బాల కార్మికులను గుర్తించేందుకు బుధవారం ప్రత్యేక తనిఖీ బృందం పర్యటించింది. అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ కాశి శివనాగమల్లేశ్వరరావు పర్యవేక్షణలో సిఆర్‌పి శేషగిరిరావు, పోలీస్ శాఖ ఎఎస్ఐ వెంకటేశ్వరరావు, అలెర్ట్ నాగో నుంచి జిల్లా కోఆర్డినేటర్ శ్రీనివాస్, శ్రమ సంస్థకు చెందిన నాగేశ్వరి, దుర్గారావు ఈ తనిఖీల్లో పాల్గొన్నారు. వివిధ దుకాణాలు, వ్యాపార సంస్థలు, ఇటుక బట్టీలు, వృత్తి నిర్వహణ కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా 18 సంవత్సరాల లోపు బాల కార్మికులను ఏ విధమైన షాపుల్లోనూ పనులు చేయించరాదని అన్నారు. షాపు యజమానులకు చట్ట నిబంధనలపై అవగాహన కల్పించారు. బాల కార్మికుల నిర్మూలన కోసం కార్మిక శాఖ కృషి చేస్తుందని, దీనికి యజమానులు సహకరించాలన్నారు. ప్రతి యజమాని చట్టానికి అనుగుణంగా నడుచుకోవాలని కోరారు.

ఎపి పీజీ సెట్‌లో మనోహర్‌కు మొదటి ర్యాంకు

ప్రజాశక్తి - అమలాపురం

ఎపిపిజి సెట్ ఫలితాల్లో స్థానిక వెంకటేశ్వరా కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ సైన్స్, డిగ్రీ కళాశాల ఫిజిక్స్ లెక్చరర్ కెఎస్‌విఎన్.మనోహర్ రాష్ట్ర స్థాయిలో ఓపెన్ కేటగిరిలో మొదటి ర్యాంకును సాధించారు. ఫిజికల్ సైన్స్ విభాగంలో 91/100 మార్కులతో మొదటి ర్యాంక్ సాధించారు. గత 16 సంవత్సరాలుగా ఫిజిక్స్ లెక్చరర్‌గా పనిచేస్తూ తన విద్యార్థులకు 2 నుంచి 10 వరకూ టాప్ ర్యాంక్స్‌ను అందించారు. ఈ సారి ఆయనే రాష్ట్ర స్థాయిలో మొదటి ర్యాంకు సాధించడం పట్ల కరెస్పాండెంట్ కె.నరసింహారావు ఛైర్‌పర్సన్ ఎం.విజయలక్ష్మి, వైస్ ఛైర్మన్ కె.ప్రవీణ్, సీనియర్ లెక్చరర్ వరప్రసాద్, కళాశాల ఫ్యాకల్టీలు అభినందనలు తెలిపారు.

మాదక ద్రవ్యాలపై అవగాహనా సదస్సు

ప్రజాశక్తి - రావులపాలెం

అంతర్జాతీయ మాదక ద్రవ్యాలు, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక టిఎస్‌ఎన్‌బి ఫంక్షన్ హాల్లో బుధవారం అవగాహన సదస్సు జరిగింది. ఈ సదస్సులో సిఐ శేఖర్‌బాబు, కొత్తపేట ఎక్సైజ్ సిఐ కాత్యాయని పాల్గొని మాట్లాడారు. మాదక ద్రవ్యాలు యువత భవిష్యత్తును ఛిద్రమయ్యేలా చేస్తున్నాయని, అభం శుభం తెలియని విద్యార్థులు చిన్న వయస్సులోనే డ్రగ్స్‌కు బానిస అవుతున్నారన్నారు. ఈ ప్రమాదకర వ్యసనాలపై యువత అవగాహన కలిగి ఉండాలని సూచించారు. సమాజంలో మాదక ద్రవ్యాలను నిర్మూలించేందుకు నేటి నుంచే పోరాటం మొదలు పెట్టాలని ప్రతి ఒక్కరు బాధ్యతగా వ్యవహరించి, డ్రగ్స్ వినియోగాన్ని నిరోధించడంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అనంతరం విద్యార్థులు మాదక ద్రవ్యాలపై నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మెప్మా బజార్లతో ఆర్థిక ప్రగతి

ప్రజాశక్తి - ముమ్మిడివరం

మహిళల ఆర్థిక ప్రగతికి మెప్మా అర్బన్ బజార్లు దోహదం చేస్తాయని నగర పంచాయతీ కమిషనర్ రవివర్మ అన్నారు. బుధవారం నగర పంచాయతీ కార్యాలయం ఆవరణలో మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అర్బన్ బజార్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి నెల అర్బన్ మార్కెట్ ఏర్పాటు చేసి, మెప్మా స్వయం సహాయక సంఘాల సభ్యులు చేతి వృత్తుల ద్వారా తయారు చేసిన ఉత్పత్తులను విక్రయించడం జరుగుతుందన్నారు. స్వయం సహాయక సంఘాల సభ్యులు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మెప్మా సిఎంఎం ఎస్.భాస్కర్, కో-ఆర్డినేటర్ దేవకీదేవి పాల్గొన్నారు.

పలువురికి యోగాంధ్ర అవార్డులు

ప్రజాశక్తి - యంత్రాంగం

రామచంద్రపురం యోగాంధ్రా దినోత్సవాన్ని విజయవంతం చేసినందుకు రామచంద్రపురం డివిజన్‌కు నాలుగు అవార్డులు వచ్చాయి. ఆర్‌డిఒ అఖిల, రామచంద్రపురం తహశీల్దార్ బి.మృత్యుం జయరావు, ద్రాక్షారామ ఇఒ అల్లు.వెంకటదుర్గా భవాని, సహాయ కమిషనర్ విఆర్ఆర్.రాజు ప్రశంసా పత్రాలను కలెక్టర్ చేతుల మీదుగా అందుకున్నారు.

ఆత్రేయపురం యోగాంధ్రా కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించినందుకు స్థానిక తహశీల్దార్ టి.రాజేశ్వరరావు కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్, జాయింట్ కలెక్టర్ నిశాంతి చేతుల మీదుగా ప్రశంశాపత్రాన్ని అందుకున్నారు. **ఆలమూరు** స్థానిక ఎంపిడిఒ ఎ.రాజుకు ఉత్తమ అవార్డును కలెక్టర్ మహేష్‌కుమార్, జాయింట్ కలెక్టర్ నిశాంతి, ఆర్‌డిఒ శ్రీకర్ చేతులమీదుగా అందుకున్నారు.

బాధ్యతలు స్వీకరించిన ఎంపిడిఒ భవాని

ప్రజాశక్తి - మామిడికుదురు

ఎంపిడిఒకు స్వాగతం పలుకుతున్న సిబ్బంది

మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా జి.భవాని బుధవారం బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీలో భాగంగా అనపర్తి నుంచి ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా మండల పరిపాలనాధికారి కారుపల్లి వెంకటేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు, ప్రజలకు అందుబాటులో ఉండి విధులు పట్ల బాధ్యత వహిస్తూ ప్రజా సమస్యలను పరిష్కరించాలని కోరారు. వర్షాకాలం సీజనల్ కావడంతో పరిసరాల పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యత ఇచ్చి తాగునీరు కలుషితం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

సమాజ సేవలో భాగస్వాములు కావాలి

ప్రజాశక్తి - రావులపాలెం

సమావేశంలో మాట్లాడుతున్న డేవిడ్‌రాజ్

క్రైస్తవులు సమాజ సేవలు భాగస్వాములు కావాల్సిన అవసరం ఉందని నియోజకవర్గ క్రైస్తవ సంఘాల జాయింట్ కమిటీ అధ్యక్షులు రెవ.ఎన్.డేవిడ్‌రాజ్ సూచించారు. బుధవారం టిల్ ప్లాక్‌లో క్రైస్తవ సంఘాల జెఎసి సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశానికి అధ్యక్షత వహించిన డేవిడ్‌రాజ్ మాట్లాడుతూ కొత్తపేట నియోజకవర్గ పాస్టర్స్, క్రైస్తవుల ఐక్యతతో నడుచుకోవాలని అన్నారు. క్రైస్తవులు క్రీస్తు మార్గాన్ని అనుసరిస్తూ సమాజ సేవలో ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో సెక్రెటరీ బిషప్, అడపా ప్రసాద్, జాయింట్ సెక్రెటరీ రెవ బండి కాంతరాజ్, ట్రెజరర్, రెవ.ఎన్.ప్రకాష్‌కుమార్, సుదర్శన్, రెవ.కప్పల డామియాన్ ఇశ్రాయేలు, తదితరులు పాల్గొన్నారు.

ఎడ తెరిపి లేని వర్షం

ప్రజాశక్తి - రామచంద్రపురం

నిర్మానుష్యంగా మారిన ద్రాక్షారామ రోడ్డు

గత 3 రోజులుగా కురుస్తున్న అడపాదడపగా ఉన్న వర్షం బుధవారం ఉదయం నుంచి ఎడతెగని వర్షంతో జనజీవనం స్తంభించింది. రోడ్లన్నీ నిర్మాణుష్యంగా తయారయ్యాయి. సామాన్యులు బయటకు వచ్చేందుకు నిత్యవసరాలు కొనుక్కునేందుకు వీలు లేకుండా పోయింది. మరోవైపు వర్షం అధికంగా కురవడంతో రైతులు తొలకరి దమ్ములకు ఉపక్రమిస్తున్నారు. వర్షంతో పంట కాలవల లోను నీటిమట్టం పెరిగింది. పలు పల్లపు ప్రాంతాలు, వర్షానికి జలమయమయ్యాయి.

డ్రగ్స్ రహిత రాష్ట్రానికి కృషి

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని డ్రగ్స్ రహిత రాష్ట్రం దిశగా పయనించేలా ప్రతి వ్యక్తి కృషి చేయాలని నిడదవోలు ఎక్సైజ్ సిఐ శ్రీరాం సతీష్ విద్యార్థులకు సూచించారు. ఈనెల 26వ తేదీ అంతర్జాతీయ మాదక ద్రవ్య వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం మండలంలోని వేలివెన్నులో శ్రీమతి అన్నపూర్ణ విద్యా నికేతన్‌లో విద్యార్థులకు మద్యనిషేధ, అబ్కారీ శాఖ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. మాదకద్రవ్యాల వినియోగం వల్ల వ్యక్తులు ఆర్థికంగా, శారీరకంగా బలహీనులు కావడమే కాకుండా కుటుంబ పరంగా, సమాజపరంగా చెడ్డ పేరు పొందుతారన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ మాదకద్రవ్యాల వైపు మనసు మరలకుండా ఉన్నత లక్ష్యాలపై దృష్టి పెట్టాలన్నారు. తద్వారా ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉండ్రాజవరం జడ్‌పిటిసి సభ్యులు నందిగం భాస్కరరామయ్య, ఎక్సైజ్ ఎస్.ఐ బాలాజీ, సిబ్బంది, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మరమ్మతు పనుల పరిశీలన

ప్రజాశక్తి - మండపేట

పట్టణంలోని బురుగుంట చెరువు పార్కు వద్ద వాటర్ ట్యాంక్ మరమ్మతు పనులను మున్సిపల్ ఛైర్‌పర్సన్ పతివాడ నూకదుర్గారాణి పరిశీలించారు. బుధవారం జరిగిన ఈ పర్యటనలో ఆమె మాట్లాడుతూ పనుల్లో జాప్యం జరగకుండా నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా ఎప్పటికప్పుడు ట్యాంకర్ల ద్వారా తాగునీరు సరఫరా చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఇఇ ఎంటి. హుస్సేన్, మున్సిపల్ అధికారులు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

దస్తావేజు పడిపోయినది

బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా, రామచంద్రపురం మా తండ్రిగారైన విత్తనాల వెంకట్రావు రామచంద్రపురం మున్సిపాలిటీలో కొన్న ఇంటి స్థలం సంబంధించిన ఒరిజినల్ దస్తావేజులు మరియు సదరు దస్తావేజులకు సంబంధించిన లింకు దస్తావేజు ఒరిజినల్ ది. 1-6-2025 తేదీన ఆలమూరు కోర్టు రోడ్డులో గల జిరాక్స్ తీయించుటకు తీసుకొని వెళుతుండగా, లింకు, ఒరిజినల్ దస్తావేజులు, 7-8-1982 తేదీ గల డాక్యుమెంట్స్ నెం. 2699/1992 గలవి పడిపోయినవి. ఎవరికైనా దొరికిన యోడల ఈ కింది అడ్రస్ తెలియజేయవలసిందిగా కోరుచున్నాము.

అడ్రస్: వి.వి.వి.సత్యనారాయణ
అడ్వకేట్, ఆలమూరు
సెల్ నెం 9491190137

మోడీ హయాంలో రాజ్యాంగానికి తూట్లు

ప్రజాశక్తి - కొవ్వూరు

మోడీ హయాంలో రాజ్యాంగానికి తూట్లు పొడిచి హిందూ రాజ్యాంగాన్ని అమలు చేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు టికె.విశ్వేశ్వరరెడ్డి అన్నారు. బుధవారం కొవ్వూరు పట్టణంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రాజ్యాంగ పరిరక్షణ ర్యాలీ నిర్వహించారు. ఎల్ఐసి కార్యాలయం మీదుగా బస్టాండ్ వరకు ర్యాలీ కొనసాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్లమెంట్లో అమిత్ షా రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్‌ను అవమానించారన్నారు. రాజ్యాంగం పట్ల కేంద్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదన్నారు. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించడం కోసం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఇంటింటా కాంగ్రెస్ కార్యక్రమం, ర్యాలీ నిర్వహించినట్లు ఆయన తెలిపారు. దేశంలో ప్రైవేట్, కార్పొరేట్ రంగాలకు ప్రభుత్వ సంస్థలను అప్పగిస్తున్నారన్నారు. బిజెపి ప్రభుత్వంలో క్రైస్తవులు, ముస్లింలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. ఆర్థిక వ్యవస్థ అధోగతిపాలైందన్నారు. రూ.327 లక్షల కోట్లు ప్రధాని మోదీ అప్పులు చేశారన్నారు. చుట్టుపక్కల దేశాలతో విభేదాలు తెచ్చుకుని, చైనా, పాకిస్తాన్‌లతో వైరం పెంచుకున్నారన్నారు.

పురపాలక సంఘం - అమలాపురం

ఆర్.ఓ.సి. నెం. 758/2020-ఇ1 తేది.24-06-2025

ఇ-ప్రొక్యూర్‌మెంటు టెండరు నోటీసు

అమలాపురం పురపాలక సంఘ పరిధిలో సాధారణ నిధులతో ఎనభై ఒకటి (81) పనులకు రూ. 453.99 లక్షలతో ఇ-ప్రొక్యూర్‌మెంటు ద్వారా టెండరు పిలువబడినది.

15 పనులకు షార్టు టెండరు షెడ్యూల్ డౌన్ లోడింగ్ ప్రారంభ తేది. 25-06-2025 సా॥ 07.00ల నుండి ముగింపు తేది. 03-07-2025 సా॥ 04.00ల వరకు

మరియు

66 పనులకు టెండరు షెడ్యూల్ డౌన్ లోడింగ్ ప్రారంభ తేది. 25-06-2025 సా॥ 7.00ల నుండి ముగింపు తేది. 11-07-2025 సా॥ 04.00ల వరకు

మిగిలిన వివరములు www.tender.apeprocurement.gov.in వెబ్‌సైట్ నందు చూడగలరు.

సం/- **కమిషనరు,** అమలాపురం పురపాలక సంఘం

In the Court of the 1st Addl. Junior Civil Judge, Rajahmundry

O.S. No. 50/2025

Between:
Sri Venkateswara Swamy Sand & Boatmen Labour Contract Cooperative Society Ltd., rep. by its Secretary, K.V.Rao.
...Plaintif

AND

Eedala Chaya Bhavani and Others
...Defendants

D-3: Eedala Bhaskara Chowdary, S/o. (late) Srinivas, D.No. 80-3-12, Vikas Nagar, J.N.Road, Rajahmundry.

పై నెంబరులో మీకు శ్రీ కోర్టు వారు నోటీసు నిమిత్తం **ది. 01-7-2025 సం॥ తేదీకి వాయిదా వేసియున్నారు.** కావున మీరు వాయిదా రోజు **ఉదయం గం॥ 10.30 ని॥లకు** పై కోర్టులో స్వయంగా గాని, వకీలు ద్వారా గాని హాజరు అయి మీ ఆక్షేపణలు తెలుపుకోవలెను. లేని యెడల మీ పరోక్షమందు తీర్మానించబడును.

రాజమండ్రి 24-6-25
సిహెచ్.వి.ప్రసాద్
వాది తరపు అడ్వకేటు
రాజమండ్రి

జనరల్ నోటీసు

మహారాజశ్రీ రాజమండ్రి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

I.A. No. 699/2025 in **O.S. No. 461/2025**

Between:
Binniboina Asha Bharathi, W/o. Sunil Kumar, Brindavanam Street, Near: Ramalayam, Bitragunta, rep. by Power of Attorney Agent, Palivela Veera Satyanarayana, S/o. Ramachandra Rao, Door No. 82-17-03/F, Mahalakshmi Temple, A.V.Appa Rao Road, Rajahmundry.

2. Bommanaboina Satya Jyothi, C/o Sathi Raju, Door No. 60-7-26/3, P&T Colony, Rajahmundry, rep. by Power of Attorney Agent, Bommanaboina Sathi Raju, S/o. Reddiah, P&T Colony, Rajahmundry.

...Petitioners/ Plaintiffs

AND

1. State of Andhra Pradesh, rep. by its Collector, East Godavari District, Andhra Pradesh.
2. Collector, East Godavari District, Rajamahendravaram.
3. Tahsildar, Rajanagaram, East Godavari District.
4. Executive Engineer, Panchayat Raj Dept., Rajanagaram, East Godavari District.
5. Adabala Veera Venkata Satyanarayana @ Babi, S/o. Rambala Subrahmanya, Seetarampuram, Rajanagaram Mandal.
6. Bobbara Varahalu, S/o. Appa Rao, Sarpanch, Seetharampuram, Rajanagaram Mandal.
7. G.Dhanalakshmi, Panchayat Secretary, Seetharampuram, Rajanagaram Mandal,
8. Vegisetti Venkata Ramana, S/o. Srinu, Surveyor, Seetarampuram, Rajanagaram Mandal.

(Defendants 5 to 8 for themselves and as representatives of their like minded persons)

...Respondents/ Defendants

పై నెంబరు దావా షెడ్యూలు దాఖలా భూమిని రాజానగరం మండలం, సీతారాంపురం గ్రామం నందు రోడ్డుగా Convert చేయుటకు ప్రయత్నం చేయుచున్నందున పై నెంబరు దావాను వాద్లు, ప్రతివాద్లు 5 నుండి 8 ల పైన మరియు తమకు సమాన హక్కులు మరియు అభిప్రాయములును కల్గిన ఇతరుల పైన "రిప్రజెంటేటివ్ కెపాసిటీ"లో దావా దాఖలు చేసినందున అందు విషయమై ఎవరికైనా ఆక్షేపణలు ఉన్నచో **30-6-2025వ తేదీన ఉదయం 10.30 గం॥లకు** పై కోర్టు వారి ఎదుట హాజరు అయి తెలియపర్చుకోవలెను.

(By Order of the Court)

మద్దూరి శివ సుబ్బారావు
మద్దూరి శివరామ శశిభూషణ్
రాజమండ్రి అడ్వకేట్లు, దానవాయిపేట
ది.10-5-2025 రాజమండ్రి